సాక్షి
కామారెడ్డి
బుధవారం ♦ 12 ♦ ఫిబ్రవరి ♦ 2025



వ్యాపారాలపై ప్రభావం..

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులతో జన సంచారం తగ్గి వ్యాపారాలు దెబ్బతింటున్నాయి.

- 8లో ▸



90 కిలోల గంజాయి..

నిజాంసాగర్ మండలం మాగి చౌరస్తా వద్ద 90.80 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /17.6

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం(దూర విద్య విభాగం)లో పీజీ, పీజీ డిప్లొమా కోర్సులలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చేనెల 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94403 56276, 91823 04067 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం'

కామారెడ్డి అర్బన్: వేసవిలో ఎదురయ్యే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఈనెల 7న 6,453 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదు కాగా.. పదో తేదీన 15,998 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైందని పేర్కొన్నారు. వేసవి డిమాండ్ దృష్ట్యా కొత్తగా 17 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, మరికొన్నింటి సామర్థ్యం పెంచామని తెలిపారు. విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ లైన్లు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

'యూరియా కొరత లేదు'



మాచారెడ్డి: మండలంలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎల్లంపేటలో పర్యటించారు. రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుభరోసా, రుణమాఫీ పథకాలపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. గ్రామంలో కొనసాగుతున్న పంటల డిజిటల్ సర్వేను పరిశీలించారు. డిజిటల్ సర్వేలో ప్రతి రైతు పాల్గొనాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్, ఏఈవోలు ఉన్నారు.

పండిత్ దీన్ దయాళ్ వర్ధంతి



కామారెడ్డి టౌన్: భారతీయ జనసంఘ్ అధ్యక్షుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం కామారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు ప్రవీణ్, నరేందర్, నాయకులు సురేష్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని మధ్యాహ్న భోజనం



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. వారం రోజుల క్రితం పాఠశాలలో ఏజెన్సీ నిర్వాహకులు వండిన భోజనం వికటించడంతో ఏజెన్సీని రద్దు చేశారు. కొత్త ఏజెన్సీని నియమించినా వారు కూడా ఒక్క రోజు మాత్రమే వండి మానేశారు. దీంతో నాలుగు రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. కొంతమంది విద్యార్థులు హాస్టళ్లు, ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వస్తున్నారు. మరికొందరు మధ్యాహ్నం పస్తులుంటున్నారు. అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సద్గుణ వికాసమే శాఖ లక్ష్యం

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): సద్గుణ వికాసమే ఆర్ఎస్ఎస్ శాఖ ప్రధాన లక్ష్యమని సంస్థ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం వినాయకనగర్‌లో సంకట విమోచన శాఖ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రచారం కోసం కాకుండా ప్రజల మేలు కోసం, దేశ హితం కోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ శివకుమార్, జిల్లా కార్యవాహ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సర్వం సన్నద్ధం!



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాలను విడుదల చేశారు. ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కొనసాగుతోంది. పాత రిజర్వేషన్లను పరిశీలించిన అధికారులు.. రిజర్వేషన్ల ఖరారు కోసం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల కోసం నిరీక్షిస్తున్నారు.

- పరిషత్ ఎన్నికలకు యంత్రాంగం రెడీ
- ఆర్వోలు, ఏఆర్వోలకు కొనసాగుతున్న శిక్షణ
- మిగిలింది రిజర్వేషన్ల వద్దు..
- పాత రిజర్వేషన్లను పరిశీలించిన అధికారులు
- ఎన్నికల కమిషన్ ఆదేశాల కోసం నిరీక్షణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 536 గ్రామాల సర్పంచ్ పదవులతో పాటు 4,696 వార్డు స్థానాలు, 25 జెడ్పీటీసీ స్థానాలు, 237 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఇందుకోసం గతంలో ఉన్న రిజర్వేషన్ల వివరాలను పరిశీలించారు. గతంలో ఎలా చేశారు, ఇప్పుడు ఎలా చేయాలన్న దానిపై కసరత్తు చేశారు. ఏ వర్గానికి ఎంత శాతం రిజర్వేషన్లు అన్నదానికి అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవులకు రాష్ట్ర స్థాయిలో రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. మండల పరిషత్ అధ్యక్ష పదవులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలకు జిల్లా స్థాయిలో రిజర్వేషన్లు ఖరారవుతాయి. ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్‌లు, వార్డులకు మండల స్థాయిలోనే రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు డి.శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్‌తో పాటు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉన్నారు.

పంచాయతీ ఎన్నికల కోసం..

జిల్లాలో పంచాయతీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడతలో కామారెడ్డి, బీబీపేట, మాచారెడ్డి, దోమకొండ, భిక్కనూరు, రామారెడ్డి, రాజంపేట, లింగంపేట, గాంధారి, తాడ్వాయి,నాగిరెడ్డిపేట, సదాశివనగర్, పల్వంచ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆయా మండలాల పరిధిలోని 2,351 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల నిర్వహణకు 6,653 మంది సిబ్బందిని కేటాయించారు. రెండో విడతలో ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, డోంగ్లీ, మద్నూర్, జుక్కల్, పిట్లం, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా మండలాల పరిధిలోని 2,364 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల నిర్వహణకు 6,543 మంది సిబ్బందిని నియమించారు.

అధికారుల నియామకం..

జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం ఎంపీటీసీ స్థానాలకు 94మంది ఆర్వోలు, 94 ఏఆర్వోలను నియమించారు. జెడ్పీటీసీ ఎన్నికల కోసం 27 మంది ఆర్వోలు, 27 మంది ఏఆర్వోలను నియమించారు. ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కొనసాగుతోంది.

ముసాయిదా ఓటరు జాబితా వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బాన్సువాడ	14,197	15,429	02	29,628
భిక్కనూరు	18,706	20,394	02	39,102
బీబీపేట	10,089	10,859	00	20,948
బిచ్కుంద	20,140	21,026	05	41,171
బీర్కూర్	9,540	10,688	00	20,228
దోమకొండ	11,503	12,911	00	24,414
డోంగ్లీ	7,340	7,379	00	14,719
గాంధారి	19,913	20,449	00	40,362
జుక్కల్	18,492	18,676	00	37,168
కామారెడ్డి	8,847	9,887	00	18,734
లింగంపేట్	18,372	19,821	01	38,194
మాచారెడ్డి	9,683	10,484	01	20,168
మద్నూర్	16,185	16,448	00	32,633
మహ్మద్‌నగర్	6,556	7,449	02	14,007
నాగిరెడ్డిపేట్	12,002	13,773	00	25,775
నస్రుల్లాబాద్	9,989	11,327	00	21,316
నిజాంసాగర్	6,831	7,565	00	14,396
పల్వంచ	8,005	9,106	00	17,111
పెద్దకొడప్‌గల్	8,856	9,016	01	17,873
పిట్లం	17,191	18,241	02	35,434
రాజంపేట్	10,820	11,722	00	22,542
రామారెడ్డి	12,874	14,236	00	27,110
సదాశివనగర్	15,882	17,210	00	33,092
తాడ్వాయి	12,308	13,795	00	26,103
ఎల్లారెడ్డి	9,852	11,050	00	20,902
మొత్తం	3,14,173	3,38,941	16	6,53,130

పరిషత్ ఎన్నికల కోసం..

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 25 మండలాల్లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను మంగళవారం విడుదల చేశారు. 1,286 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో పరిషత్ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితానూ ప్రకటించారు. మొత్తం 6,53,130 మంది ఓటర్లు ఉన్నట్టు ముసాయిదా జాబితాలో పేర్కొన్నారు. ఇందులో 3,14,173 మంది పురుషులు, 3,38,941 మంది స్త్రీలు, 16 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా బిచ్కుంద మండలంలో 41,171 మంది ఓటర్లుండగా.. అత్యల్పంగా మహ్మద్‌నగర్ మండలంలో 14,007 మంది ఓటర్లున్నారు.



కందకుర్తిలో నిర్మిస్తున్న స్ఫూర్తి కేంద్రం వద్ద త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కందకుర్తికి ప్రత్యేక గుర్తింపు

- ఆర్ఎస్ఎస్ ద్వారానే ఉన్నత స్థానానికి ఎదిగాను
- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

రెంజల్(బోధన్): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థాపకులు కేశవ బలిరాం హెడ్గేవార్ పూర్వీకుల స్వస్థలమైన రెంజల్ మండలంలోని కందకుర్తి ప్రపంచంలోని కోట్లాది మందికి మార్గనిర్దేశం చేసిన గ్రామమని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కందకుర్తిని సందర్శించారు. ముందుగా హెడ్గేవార్ పూర్వీకుల స్ఫూర్తి మందిరాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ద్వారానే తాను త్రిపుర గవర్నర్ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. 1963లో బాల్య స్వయంసేవక్‌గా చేరానని, అనంతరం వివిధ స్థాయిల్లో శిక్షా వర్గలు పూర్తి చేశానని వివరించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిటీ ఆర్గనైజర్‌గా పనిచేశానన్నారు. తర్వాత జనతా పార్టీ ద్వారా రాజకీయ ప్రవేశం ప్రారంభమైందన్నారు. 2023లో త్రిపుర గవర్నర్‌గా తనకు అవకాశం లభించిందని గుర్తు చేశారు.

దేశంలోని చిన్న రాష్ట్రాల్లో మూడవది..

దేశంలోని చిన్న రాష్ట్రాల్లో త్రిపుర మూడవ రాష్ట్రమని, 40 లక్షల జనాభా, 60 మంది ఎమ్మెల్యేలు ఉంటారని ఇంద్రసేనా రెడ్డి పేర్కొన్నారు. త్రిపురకు మూడు వైపులా బంగ్లా సరిహద్దు 856 కిలోమీటర్లు ఉంటుందన్నారు. అస్సాం, మిజోరాం రాష్ట్రాలు కూడా 150 కిలోమీటర్లు ఉంటాయన్నారు. రాబోయే రోజుల్లో త్రిపుర రాష్ట్రం నార్త్‌ఈస్ట్ ప్రాంతానికి గేట్‌వేగా మారుతుందన్నారు. తనను ఈ స్థాయికి తీసుకు వచ్చిన ఆర్ఎస్ఎస్‌కు కృతజ్ఞుడినై గతంలో కందకుర్తికి రెండు పర్యాయాలు వచ్చానని, గవర్నర్ స్థాయిలో ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకునేందుకు మూడవ పర్యాయం గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట కేశవ సేవా సమితి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వాసు, అంకు మహేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డితో పాటు మండల, జిల్లా ప్రతినిధులు ఉన్నారు.

పూర్తి అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: పంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించడానికి ఎన్నికల విధులపై పూర్తి అవగాహన అవసరమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు మంగళవారం కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులను జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శిక్షణ తరగతుల్లో వివరించిన అన్ని అంశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం సరఫరా చేసే హ్యాండ్ బుక్‌ను తప్పనిసరిగా చదవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలను నిర్వహించాలన్నారు. ఆయా అంశాల్లో సమయ పాలనను పక్కాగా పాటించాలన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఈవో రాజు, ఆర్డీవో ప్రభాకర్, మాస్టర్ ట్రైనర్స్ నాగరాజు, సురేందర్, శ్రీనివాస్, ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాలు ఖాళీ

- కొక్కెర, బర్డ్‌ఫ్లూలతో వేలాది కోళ్ల మృత్యువాత
- భారీగా నష్టపోయిన పౌల్ట్రీ రైతులు

బీబీపేట: కొక్కెర, బర్డ్‌ఫ్లూ వ్యాధులతో కోళ్లు మృత్యువాత పడుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వేలాది కోళ్లు మృత్యువాతపడడంతో చాలామంది నష్టపోయారు. వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో కొంతమంది ముందుగానే కోళ్లను విక్రయించారు. దీంతో చాలాచోట్ల పౌల్ట్రీ ఫారాలు ఖాళీ అయ్యాయి. ఓవైపు వ్యాధులు ప్రబలుతుండడం, మరోవైపు ఎండాకాలం ముందుండడంతో కొత్త బ్యాచ్‌లు వేసేందుకూ రైతులు వెనకాడుతున్నారు.

సహకరించని వాతావరణం

వాతావరణ మార్పులు సైతం కోళ్ల పెంపకానికి ప్రతిబంధకంగా మారాయి. బ్రాయిలర్ కోడి పిల్లలు ఫామ్‌లో దిగిన రోజు నుంచి అవి పెరిగి పెద్దగా అయ్యే వరకు ఒకేరకమైన వాతావరణం ఉండాలి. కానీ ప్రస్తుతం జిల్లాలో అలాంటి పరిస్థితి లేదు. రాత్రివేళ మంచు కురవడం, పొద్దంతా ఎండలు, ఉక్కపోతతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఫారాల్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టినా ఫలితం ఉండడం లేదు.

కంపెనీల వెనకడుగు

జిల్లాలోని ఎక్కువ శాతం కోళ్ల ఫారాల రైతులతో ప్రైవేటు కంపెనీలు అగ్రిమెంట్ చేసుకొని కోడి పిల్లలను సరఫరా చేస్తాయి. ఆ పిల్లలను పెంచి తిరిగి ఆయా కంపెనీలకు అప్పగిస్తే.. కిలోకు కొంత మొత్తాన్ని ఇస్తాయి. ప్రస్తుతం వ్యాధులు సోకి మృత్యువాత పడుతుండడంతో కోడి పిల్లలను ఇచ్చేందుకు కంపెనీలు సైతం ముందుకు రావడం లేదు. సాధారణంగా వేసవికాలంలో కోళ్లు చనిపోతాయనే ఉద్దేశంతో రైతులకు తక్కువ సంఖ్యలో కోడిపిల్లలను కంపెనీలు సరఫరా చేస్తాయి. ప్రస్తుతం వేసవికి తోడు వ్యాధుల ప్రభావంతో కోడి పిల్లలను ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నాయి.

తగ్గిన చికెన్ ధర..

కోళ్లకు వ్యాధులు సోకుతుండటంతో చికెన్ ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గత నెల 22న కిలో కోడి ధర రూ. 149, డ్రెస్డ్ రూ. 216, స్కిన్‌లెస్ రూ. 246 ఉండగా మంగళవారం కోడి కిలో ధర రూ. 119, డ్రెస్డ్ రూ. 173, స్కిన్‌లెస్ రూ. 196కు పడిపోయాయి.



బీబీపేటలో ఖాళీగా ఉన్న కోళ్ల ఫారం

పల్లెలపై నజర్..!



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో పట్టణాల్లో నివసిస్తున్న కొందరు లీడర్లు పల్లెలపై దృష్టి సారించారు. పట్టణాల్లో కౌన్సిలర్ టికెట్ పొందడానికి తీవ్రంగా పోటీ పడాల్సిన పరిస్థితులు ఉండడంతో.. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొందరు సొంతూళ్లలో ఓటు హక్కు నమోదు చేసుకుని పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- 'స్థానిక' ఎన్నికల్లో పోటీకి పలువురిలో ఆసక్తి
- గ్రామాలలో ఓటర్లుగా నమోదు
- సొంతూళ్లకు తరచూ వెళ్లి వస్తున్న నేతలు
- ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వ్యాపార, ఉపాధి అవకాశాల కోసమో.. పిల్లల చదువుల కోసమో.. ఇతర కారణాల రీత్యానో చాలామంది సొంతూళ్లను వదిలి పట్టణాల్లో స్థిరపడ్డారు. రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారు తరచూ గ్రామాలకు వచ్చి వెళ్తున్నారు. కొంతమంది స్వగ్రామంలోనే ఓటు హక్కును కొనసాగిస్తుండగా.. మరికొందరు తాము నివసిస్తున్న ప్రాంతాలకు బదిలీ చేసుకున్నారు. కాగా ఊళ్ల నుంచి పట్టణాలకు వలస వచ్చి స్థిరపడిన వారు ఈ మధ్య సొంతూళ్ల రాజకీయాల్లో తలదూరుస్తున్నారు. తాము చదువుకున్న స్కూళ్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు, కుల సంఘాల కార్యక్రమాల్లో పాల్గొంటూ తాము ఊరిని మరిచిపోలేదనే సంకేతాలు ఇస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో చాలాకాలం క్రితం స్థిర నివాసం ఏర్పరచుకున్న ఎంతోమంది ఇటీవల అడపాదడపా సొంతూళ్లకు వెళ్లి వస్తున్నారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలతో పాటు ఇతర వ్యాపారాల్లో నాలుగు డబ్బులు సంపాదించిన వారు లోకల్ రాజకీయాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. పదవి దర్జా కోసం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. గత ఎన్నికల్లో కొందరు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు మరికొందరు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయం, పదవులతోనే తమకు హోదా పెరుగుతుందని, పలుకుబడి ఉంటుందనే భావనతో నాలుగు డబ్బులు సంపాదించిన వారంతా రాజకీయాల్లో అరంగేట్రం చేస్తున్నారు.

జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఫోకస్

మండల స్థాయి పదవులైన ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులపై కొందరు నేతలు కన్నేశారు. రిజర్వేషన్ కలిసి వచ్చి, పోటీ చేసే అవకాశం దొరికితే ఎన్నికల బరిలో దిగాలని ఆలోచనలు చేస్తున్నారు. మరికొందరు గ్రామాల్లో కీలకమైన సర్పంచ్ పదవిపై దృష్టి సారించారు. గతంలో ఎన్నడూ ఊరు పేరు చెప్పుకోవడానికి కూడా ఇష్టపడని వారు.. ఇప్పుడు సొంతూరు వాళ్లతో సంబంధాలు నెరపుతున్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి కామారెడ్డి పట్టణంలో స్థిరపడి ఆర్థికంగా ఎదిగిన వారు చుట్టుపక్కల గ్రామాలపై దృష్టి పెట్టారు. కామారెడ్డి మండలంలోని గ్రామాల్లో ఓటు హక్కును నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. పట్టణాల్లో అవకాశం దక్కుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో కొందరు లీడర్లు పల్లెలపై దృష్టి సారించారు. ఇప్పటికే కొందరు తమ ఓటును పల్లెల్లో నమోదు చేయించుకున్నారు. ఎక్కడ ఏ అవకాశం వచ్చినా వదులుకోవద్దనే ఆలోచనతో మరికొందరు రెండు చోట్లా ఓట్లు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రధాన పార్టీల లీడర్లతో ఉన్న సంబంధాలతో టికెట్టు సాధించడం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుండడంతో చాలా మంది అప్రమత్తమయ్యారు. హోదా కోసమే ఎన్నికల బరిలో దిగేవారు కొందరైతే, రాజకీయం మీద వ్యామోహంతో మరికొందరు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పట్టణాల్లో ఉంటున్న లీడర్లు పల్లెల్లో పట్టు కోసం చేస్తున్న ప్రయత్నాలతో రాజకీయాలు వేడుక్కుతున్నాయి.

నామినేషన్ల పరిశీలన పూర్తి

గ్రాడ్యుయేట్ స్థానం బరిలో 68 మంది
టీచర్ స్థానంలో 16 మంది..

సాక్షిప్రతినిధి, కరీంనగర్ : కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ముగిసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 100 మంది అభ్యర్థులు 192 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో వివిధ కారణాల వల్ల 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 68 మంది నామినేషన్లను ఆమోదించారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది 38 నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ రిజెక్ట్ అయింది. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించిన సందర్భంలో ఏవైనా లోపాలు ఉంటే గుర్తించి అభ్యర్థులకు షార్ట్ మెమోలు ఇచ్చి సరిచేసుకునేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. సరైన ఫార్మాట్‌లో సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ రామన్, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, ఏవో నరేందర్, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సంజయ్ కుమార్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు బెన్హర్ మహేశ్ దూత్ ఎక్క హాజరయ్యారు.

'విద్యారంగాన్ని విస్మరించారు'



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీజేఆర్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ. 8 వేల కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, న్యాయ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్, కొత్త నర్సింలు, అజయ్, రాహుల్, నితిన్, మణికంఠ, నవీన్, విలాస్ ప్రశాంత్, సాయి గౌడ్, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మోపాల్: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన పోగుల రవీందర్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ బాధితులకు వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు జగదీశ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

90 కిలోల గంజాయి పట్టివేత



బాన్సువాడ: బాన్సువాడ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని నిజాంసాగర్ మండలం మాగి చౌరస్తా వద్ద 90.830 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు నిజామాబాద్ డీసీ సోమిరెడ్డి తెలిపారు. బాన్సువాడ ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద పట్టుకున్న గంజాయితో పాటు నిందితుల వివరాలను మంగళవారం వారు వెల్లడించారు. నల్లగొండ జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన పాలపు తిరుపతి, కరీంనగర్ జిల్లా జెమినితండాకు చెందిన గెలోత్ సత్నమ్, గాంధారికి చెందిన శ్రీనివాస్‌లు స్కార్పియో వాహనంలో గంజాయిని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 22.50 లక్షలు విలువ గల 90.830 కిలోల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. కర్ణాటకలోని నాగిలి నుంచి జహీరాబాద్ మీదుగా నాందేడ్‌కు తరలిస్తున్నారని, నిందితులు తిరుపతి, సత్నమ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. శ్రీనివాస్ పరారీలో ఉన్నాడని వివరించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈఎస్ హన్మంత్ రావు, ఏఈఎస్ డీసీబీ నాయక్, సిబ్బంది స్వప్న, రాంకుమార్, శరత్‌కుమార్, విష్ణు, అవినాష్, సందీప్ ఉన్నారు.

వ్యాపారాలపై హైవే విస్తరణ ప్రభావం



రోడ్డు విస్తరణ పనులతో లేస్తున్న దుమ్ము



రోడ్డు విస్తరణ పనుల కారణంగా మూసిఉన్న దుకాణాలు

- గోపాల్‌పేటలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు
- సర్వీస్ రోడ్ల కోసం తవ్విన గుంతల తోపాటు రోడ్డుపై లేస్తున్న దుమ్ము కారణంగా తగ్గిన జనసంచారం
- పడిపోయిన గిరాకీలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కొంతకాలంగా నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో కొనసాగుతున్న జాతీయ రహదారి ఏర్పాటు పనులతో దుకాణాల్లో గిరాకీలు లేక వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయి. రోడ్డు విస్తరణ పనుల ప్రభావం దుకాణాలపై తీవ్రంగా చూపుతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కోసం తవ్విన గుంతలతోపాటు పాటు సర్వీస్‌రోడ్ల కోసం జరుగుతున్న తవ్వకాలతో ప్రజలు దుకాణాలకు వెళ్లలేకపోతున్నారు. రోడ్డు విస్తరణ పనుల వల్ల గోపాల్‌పేటలో విపరీతంగా దుమ్ములేస్తోంది. ఈ కారణంగా గోపాల్‌పేటలో కొన్నిరోజులుగా జనసంచారం తగ్గి గిరాకీలు తగ్గిపోయాయి. దుమ్ము కారణంగా కొంతమంది వ్యాపారులు వారి దుకాణాలను కొన్ని రోజులుగా మూసేఉంచారు.

సర్వీస్ రోడ్లు పూర్తయితేనే వ్యాపారం..

మండల కేంద్రంలో జాతీయ రహదారి పనులు మొదట్లో ముమ్మరంగా కొనసాగినప్పటికీ కొన్ని రోజులుగా మందకొడిగా సాగుతున్నాయి. ప్రధాన రహదారికిరువైపులా డ్రైనేజీల నిర్మాణం కోసం తవ్విన భారీగుంతలతో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు మండల కేంద్రంలో గ్రామం బయట పూర్తయిన సర్వీస్‌రోడ్డు పనులు గ్రామంలో మాత్రం కొన్నిరోజులుగా నిలిచిపోయాయి. కనీసం ఇరువైపులా సర్వీస్‌రోడ్లు పూర్తయితే తమ వ్యాపారాలు కొంత మెరుగుపడతాయని దుకాణదారులు పేర్కొంటున్నారు.



అర్ధాంతరంగా నిలిచిన డ్రైనేజీ నిర్మాణపు పనులు

గిరాకీలు తగ్గిపోయాయి



రోడ్డు పనులు ప్రారంభం కాకముందు నా దుకాణంలో వ్యాపారం మంచిగా సాగేది. రోడ్డు పనుల్లో భాగంగా నా దుకాణం ఎదుట చేపట్టిన సర్వీస్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సర్వీస్‌రోడ్డు పనులు పూర్తయితే కొంత మేర ఊరట కలుగుతుంది.

– వినోద్, కిరాణా దుకాణం, గోపాల్‌పేట

నెలల తరబడి చేస్తున్నారు



మా దుకాణం ఎదుట డ్రైనేజీ నిర్మాణం కోసం 2 నెలల క్రితం గుంతను తవ్వారు. డ్రైనేజీ పనులు చేపట్టకపోవడం వల్ల మా దుకాణం ఎదుట తవ్విన భారీ కాలువ అలాగే ఉండిపోయింది. దీనివల్ల మా దుకాణంలోకి వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి.

– హైమద్, కూరగాయల దుకాణం, గోపాల్‌పేట

జనసంచారం తగ్గింది



కొన్నిరోజులుగా గోపాల్‌పేటలో చేపట్టిన రోడ్డు పనుల వల్ల మాకు గిరాకీలు పూర్తిగా తగ్గిపోయాయి. రోడ్డుపై లేస్తున్న దుమ్ము కారణంగా ప్రజలెవరూ గోపాల్‌పేటకు రావడంలేదు. దీనివల్ల గ్రామంలో జనసంచారం పూర్తిగా తగ్గిపోయి మాకు గిరాకీలు కూడా పడిపోయాయి. కిరాయిలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. దుకాణం తీసేయాలనుకుంటున్నాను.

– రవి, కాఫీ దుకాణం, గోపాల్‌పేట

అనారోగ్యంతో సహకార శాఖ ఉద్యోగి మృతి



కామారెడ్డి అర్బన్: సహకార శాఖ జిల్లా కార్యాలయంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎల్.రంజిత్‌కుమార్(32) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం ఆయన సొంత గ్రామం కామారెడ్డి పట్టణ పరిధిలోని రామేశ్వరపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సరాల వెంకటర్‌రెడ్డితో పాటు సహకార శాఖ జిల్లా అధికారులు రాంమోహన్, భూమయ్య, ప్రశాంత్‌రెడ్డి, ఆఫీసు సిబ్బంది అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు ఆత్మకూర్ విద్యార్థి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి బి.అరవింద్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సంతోష్ తెలిపారు. ఈ నెల 10న కామారెడ్డి జిల్లాకేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా 400 మీటర్ల పరుగు పోటీలో అరవింద్ గోల్డ్‌మెడల్ సాధించాడు. దీంతో అరవింద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ప్రశాంత్ 100మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్, 8వ తరగతికి చెందిన భవానీ, మనోహర్ ట్రయాతలాన్‌లో సిల్వర్‌మెడల్ సాధించారని సంతోష్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎం ఎండీ జబీనా అభినందించారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని ఎల్కంటి చెరువు సమీపంలో జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ లీకై నీరు వృథాగా పోతున్నాయి. వారం రోజులుగా పెద్దకొడప్‌గల్ మండల కేంద్రానికి తప్ప మిగతా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామాలలో నీటి సమస్య విపరీతంగా పెరిగిపోయింది. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటి సమస్య పెరుగుతోంది. లీకేజీలను అరికట్టి అన్ని గ్రామాలకు భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బావిలో పడి బాలుడి మృతి



లక్ష్మణ్(ఫైల్)

ఇందల్వాయి: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి బాలుడు మృతిచెందిన ఘటన డొంకల్ గ్రామ పరిధిలోని డొంకల్ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ఇలా.. తండాకు చెందిన గోవింద్–రేణా దంపతుల కొడుకు లక్ష్మణ్(13).. చదువు మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం స్నేహితులతో కలిసి అతడు మేకలను మేపేందుకు వెళ్లగా దూలగొండి ఆకు తాకడంతో సమీపంలో ఉన్న బావి వద్ద వెళ్లాడు. నీటిలో అతడు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గమనించిన స్నేహితులు తండావాసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చేలోపు లక్ష్మణ్ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి, తల్లి రేణా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ



పతకాలతో విద్యార్థినులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా డిగ్రీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి 8 బంగారు, 5 వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఎస్.దివ్య, లాంగ్ జంప్‌లో ఆర్.సంధ్య, జావెలిన్ త్రోలో అమృత, షాట్‌పుట్‌లో ఇందుమతి, అండర్–20 విభాగం 400 మీటర్ల పరుగు పందెలో దివ్య, డిస్కస్‌త్రోలో శ్రీవిద్య, బబిత, కృష్ణవేణి, కీర్తన, నవనీత, రుత్వికలు పతకాలు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



సంజన మృతదేహం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా.. కాలనీకి చెందిన మెరికాడి లక్ష్మీ–పోశెట్టి దంపతులకు కుమార్తె సంజన (15), ఓ కుమారుడు ఉన్నారు. సంజన స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో పదో తరగతి చదువుకుంటుంది. ఆమె పది రోజుల నుంచి స్కూల్‌కు వెళ్లడం లేదనీ, సరిగా చదవడం లేదనీ టీచర్ ద్వారా తెలియడంతో తల్లి కుమార్తెను మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సంజన ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోగల ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్నారు. కొంతమంది బావి వద్దకు ఈత కోసం వచ్చి స్నానం చేస్తుండగా అతడు నీటమునిగి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఇతర రాష్ట్రానికి చెందినవాడు కావచ్చని, వయస్సు సుమారు 20 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని ఎస్సై రంజిత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ లభించిన వారు 8712686164ను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

వర్క్‌ఫ్రం హోం పేరిట సైబర్ మోసం

నవీపేట: మండలంలోని ఓ వ్యక్తిని సైబర్ మోసగాళ్లు వర్క్‌ఫ్రం హోం పేరిట బురిడీ కొట్టించి, సుమారు రూ.2లక్షలకు పైగా టోకరా వేశారు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఫతేనగర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సోహెల్‌కు గతేడాది జూలై 10న టెలిగ్రామ్‌యాప్‌లో అన్య సమీరా ప్రొఫైల్ నుంచి వర్క్ ఫ్రం హోం మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేయగా కొద్దిమేర డిపాజిట్ చేస్తే ఈజీగా సంపాదించుకోవచ్చు అని నమ్మించారు. దీంతో జూలై 12న రూ. 1000 డిపాజిట్ చేయగా సోహెల్ ఎకౌంట్లోకి రూ. 1500లు వచ్చాయి. ఇలా పలుపార్లు కొంత సొమ్మును డిపాజిట్ చేయగా అధికంగా డబ్బులు వచ్చాయి. దీంతో డిసెంబర్ 30న రూ. 15,000లు, జనవరి 1న మరో రూ. 50,000లు డిపాజిట్ చేశాడు. ఎలాంటి డబ్బు జమ కాకపోవడంతో అనుమానం వచ్చి నిర్వాహకులను ప్రశ్నించాడు. అకౌంట్ ఫ్రీజ్ అయిందని డబ్బులు ఎక్కడికిపోవని వారు నమ్మించారు. దీంతో సోహెల్ జనవరి 29న మరో రూ. 1,50,000లను డిపాజిట్ చేశారు. డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అమ్మకం పేరిట..

నవీపేట మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన కాడ మారుతి సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేద్దామని సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. గత నెల 25న మారుతికి ఫేస్‌బుక్ అకౌంట్లో ఆల్టో కారు అమ్మబడునని మెసేజ్ రాగా ఫాలో అయ్యాడు. అతడికి వెంటనే గుర్తుతెలియని వ్యక్తి తన కారును అమ్మి వేస్తానని ఫోన్ చేసి, నమ్మించాడు. దీంతో అతడు రూ. 42,000 పంపించాడు. అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు పెళ్లి చూడకుండానే తండ్రి మృత్యువాత

- మొరం టిప్పర్ ఢీకొట్టడంతో మరణించిన వైనం
- తాడ్వాయి మండలకేంద్రంలో ఘటన



మైశయ్య (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): త్వరలో కొడుకు పెళ్లి.. ఇంతలో తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తాడ్వాయికి చెందిన కీసరి మైశయ్య(55) జీపీ కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. మంగళవారం తన ఇంటి నుంచి పాతబస్టాండ్ చౌరస్తాకు నడుచుకుంటూ వెళ్తుండగా, మొరం టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. టైర్లు మైశయ్యపై వెళ్లడంతో శరీరభాగాలు నుజ్జునుజ్జుఅయ్యాయి. అందరితో కలుపుగోలుగా ఉండే మైశయ్య అకస్మాత్తుగా రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. 13 రోజుల తర్వాత మైశయ్య కుమారుడి పెండ్లి ఉందని, తన కొడుకు పెండ్లి చూడకుండనే మృతిచెందినాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టిప్పర్లు ప్రతిరోజు అక్రమంగా మొరంను తరలిస్తూ, అనుభవం లేని డ్రైవర్లు అజాగ్రత్తగా నడిపించడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించి, బాధితకుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

అనారోగ్యంతో వ్యక్తి..



శంకర్ (ఫైల్)

ఎల్లారెడ్డి: మహా కుంభమేళాకు వెళ్లి అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డికి చెందిన మంగళి శంకర్ (47) మూడు రోజుల క్రితం మహా కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు కుటుంబ సభ్యులతో వెళ్లాడు. అక్కడ అతడు అనారోగ్యానికి గురికావడంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతదేహం మంగళవారం రావడంతో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

కమ్మర్‌పల్లి : మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మెట్‌పల్లి రోడ్‌లోని పల్లె చెరువు దిగువ అలుగు సమీపంలోని ఈత వనంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి వద్ద నుంచి రూ. 30,630 నగదు, 7 సెల్‌ఫోన్‌లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో మేత్రిన్ రాజ్‌కుమార్ (35) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజ్‌కుమార్ తరచూ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో భార్య మాలశ్రీ ఐదు నెలల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉండి అతిగా మద్యం తాగేవాడు. మంగళవారం సాయంత్రం అతడు ఇంట్లో మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతిగా మద్యం తాగి మృతి చెందాడా, లేదా ఏదైనా పురుగుల మందు తాగి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తండ్రి బసప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాయన్న తెలిపారు.

వైరస్‌తో మరో 6వేల కోళ్లు మృతి



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో మంగళవారం బోడ చందర్ అనే పౌల్ట్రీ రైతు కోళ్లఫారంలో అంతుచిక్కని వైరస్‌తో 6వేల కోళ్లు మృతి చెందాయి. ఆదివారం 2వేల కోళ్లు మృతి చెందగా మంగళవారం నాటికి వాటి సంఖ్య 8వేలకు చేరింది. చేతికొచ్చిన కోళ్లను మార్కెట్‌కు తరలించే సమయానికి మృతిచెందడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని పౌల్ట్రిరైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

వివిధ ఘటనల్లో పలువురికి జైలు శిక్ష

ఆర్మూర్: మామిడిపల్లి పరిధి ఆదర్శనగర్ కాలనీలో మట్కా నిర్వహిస్తున్న గుజరాతి గోవర్దన్‌కు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏడు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. గత నెల 20న మట్కా ఆడుతున్న ఆరుగురిని పక్కా సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు. వీరి వద్ద నుంచి రూ.28వేలతో పాటు 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట వారిని హాజరు పర్చగా మట్కా నిర్వాహకుడితో పాటు మట్కా ఆడుతూ పట్టుబడ్డ రాచర్ల నర్సయ్య, శేఖర్, మందాల రాజారాం, ఆటో మహేష్, షేక్‌వలికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పేర్కొన్నారు.

అటవీ భూమి కబ్జా కేసులో ముగ్గురికి..

వర్ని: వర్ని అటవీ రేంజ్ పరిధిలోని కునిపూర్ శివారులో రెండున్నర ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులకు న్యాయమూర్తి నాలుగు రోజుల రిమాండ్ విధించినట్లు జలాల్‌పూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్ వెల్లడించారు. అటవీ భూమిని కబ్జా చేయరాదని అధికారులు హెచ్చరించినా, కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి అటవీ భూమిని సాగు చేసినందుకు జడ్జి నాలుగు రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఇద్దరు మద్యం తాగి పట్టుబడినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వారిని నిజామాబాద్ కోర్టులో మంగళవారం హాజరుపరుచగా జడ్జి రెండు రోజుల శిక్ష విధించారని ఎస్సై తెలిపారు. ఈనెల 8న నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ పార్క్ దగ్గర ఎస్‌హెచ్‌వో రఘుపతి డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఒకరు మద్యం తాగి పట్టుబడ్డారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష, 24 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు.

ధర్పల్లి: ధర్పల్లి శివారులోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా సీతాయిపేట్ గ్రామానికి చెందిన సుధాకర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని నిజామాబాద్ కోర్టులో హాజరుపరుచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన షేక్ మహబూబ్ అనే వ్యక్తి డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలో ఇటీవల పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధించారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

రుద్రూర్: రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామానికి చెందిన హబీబ్ ఖాన్ అనే యువకుడు మద్యం మత్తులో డయల్ 100కు అనవసరంగా ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఈ నెల 9న పలుమార్లు డయల్ 100కు అనవసరంగా కాల్ చేసి సమయం దుర్వినియోగం చేసినందుకు నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం బోధన్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు

సిరికొండ: సిరికొండకు చెందిన ప్రశాంత్, శేఖర్‌గౌడ్ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్టున్న ఎస్సై రామ్ తెలిపారు.